# సైన్సు కాంగ్రెసు-సుబ్బారావు

డా॥ పరిమళా సోమేశ్వర్

పాతికేళ్ల తరువాత ఆంధ్ర రాజధాని హైదరాబాద్‌లో సైన్సు కాంగ్రెస్ జరగటం ఒక విశేషమైతే అందులో సుబ్బారావు సైంటిస్టు హోదాలో ప్రథమంగా పాల్గొనటం మరో విశేషం.

ఎమ్మెస్సీ పూర్తయిన తరువాత సి.యస్.ఐ.ఆర్. (C S I R) స్కాలర్‌షిప్పుతో జూనియర్ రిసెర్చి స్కాలర్‌గా సుబ్బారావు యూనివర్సిటీలో చేరి సంవత్సరం దాటింది. వివిధ దేశాల నుండి, దేశంలోని వివిధ రాష్ట్రాల యూనివర్సిటీల నుండి విచ్చేసిన శాస్త్రజ్ఞుల సమక్షంలో తన మొదటి రిసెర్చి పేపరు చదవాలని సుబ్బారావు ఎంతగానో ఉబలాటపడిపోయేడు.

సైన్సు సమావేశాలు ఇంకా మూడు నెల్లున్నాయనగానే ఎలాగైనా పేపరు పూర్తిచేయాలని తన గైడును బతిమాలడం ప్రారంభించేడు సుబ్బారావు. పదిహేనేళ్లుగా ప్రొఫెసరుగా ఉంటున్న తనకే ప్రతి సైన్సు కాంగ్రెసులోను పేపరు చదవాలంటే చిన్నప్పుడు వీధి బళ్లో బెత్తం మాస్టారు ముందు నిల్చుని ఎక్కాలు అప్పచెప్పినప్పట్లా ముచ్చెమటలుపోస్తాయే, అలాటిది నిన్న మొన్న రిసెర్చిలో చేరిన యీ జూనియర్ స్కాలర్‌గాడు అంత ధైర్యంగా పేపరు చదువుతానంటాడా! అని విస్తుపోయేడు సుబ్బారావు గైడు-ప్రొఫెసర్ పరబ్రహ్మం.

''ఇగ్నోరెన్స్ ఈజ్ బ్లిస్'' (Ignorence is Bliss) అని ఆ పిల్లకాకి అజ్ఞానాన్ని క్షమించి సరిపెట్టుకున్నా బాగుండేది. కాని అనుభవంతో, విజ్ఞానంతోపాటు మనసెదగని ఆ ప్రొఫెసర్ ఆ జూనియర్ స్కాలర్ అర్భకుడి యెడల జెలసీ లాటి ద్వేషభావాన్ని పెంచుకుని పేపరు పూర్తిచేయటానికి నానా తిప్పలూ పెట్టేడు.

ఒక్కొక్క రసాయన పదార్థానికి ముప్పైసార్లు ఇన్‌ఫ్రారెడ్ స్పెక్ట్రమ్‌లు, నలభై మూడు సార్లు NMR స్పెక్ట్రమ్‌లు తీయించేడు పధ్నాలుగుసార్లు చిత్తుప్రతిని, పన్నెండుసార్లు ఫైర్‌కాపీని వ్రాయించేడు. ఆఖరుకు ఎలాగైతేనే రెండు కాపీలు ఫైర్‌గా టైపు చేయించటానికి ఎట్టకేలకు పర్మిషన్ ఇచ్చేడు.

పేపరు కోసం గీయించిన డ్రాయింగులలో ముప్పైమూడు తప్పులను వెతికి పట్టుకుని పదమూడు సార్లు ఆర్టిస్టు చుట్టూ తిరిగి మార్పించుకు రమ్మన్నాడు. చివరికి ఆ ఆర్టిస్టు ''మనం మాట్లాడుకున్న మొత్తానికి పది రెట్లు ఎక్కువ డబ్బిచ్చినా మీ డ్రాయింగులు వెనుకస్తే గీసేది లేదు''అని ఖరా ఖండిగా చెప్పేంతగా విసిగిపోయే వరకు డ్రాయింగులలో మార్పులు చేస్తూనే వచ్చేడు ప్రొఫెసర్ పరబ్రహ్మం. ఎలాగైతేనేం పేపరు ప్రతిని జర్నల్ కమిటీకి పంపటానికి ఆఖరు తేదీ రేపనగా సుబ్బారావు మొదటి రిసెర్చి పేపరును ఓకే చేసేడు అతని గైడు.

నవమాసాలు మోసి పది గంటలకు పైగా ప్రసవ వేదన ననుభవించిన తరువాత పండంటి బాబును కని, కళ్ళారా చూసుకుని మురిసి పోయే తొలి బాలింతలా తన మొదటి రిసెర్చి పేపరు పూర్తయిన తరువాత దానిని రెండు కళ్ళతోను చూసుకున్న సుబ్బారావు ప్రొఫెసర్ ఆ పేపరు కోసం తనను పెట్టిన నరకయాతనలన్నిటినీ పీడకలలా మరుక్షణమే మర్చిపోయేడు.

వాళ్ళ యూనివర్సిటీయే సైన్సు కాంగ్రెస్‌కు ఆతిధ్యమిస్తున్నందువల్ల రిసెర్చి స్కాలర్ల నందరినీ వివిధ కమిటీలల్లోను మెంబర్లుగా వేసేరు వివిధ డిపార్టుమెంటుల వాళ్లు. సుబ్బారావుకు చిన్నప్పటి నుండి కథలు, కవితలు వ్రాయటం, రేడియోలో యువవాణి కార్యక్రమాల్లో పాల్గొనటం మొదలైన అలవాట్లుండటం వల్ల అతనిని సాంస్కృతిక కార్యక్రమాల కమిటీలో మెంబరుగావేసేరు.

''ఈ సైన్సు కాంగ్రెస్ ఉద్దేశ్యం విజ్ఞాన శాస్త్ర రంగంలో జరుగుతున్న పరిశోధనలను గురించి చర్చించుకోవటం కదా అలాటప్పుడు సైన్సు సమావేశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు అవసరమా?'' అని సుబ్బారావు సందేహంగా అడిగేడు.

''ఎంత సైంటిస్టులయినా వాళ్ళూ మానవమాత్రులే కదా! ఆటా పాటా లేకపోతే ఆ సమావేశాలు మరీ బోర్ కొట్టిస్తాయి. ఈ సాంస్కృతిక కార్యక్రమాలే లేకపోతే ప్రతి సైంటిస్టూ తన పేపరు చదివిన వెంటనే రైలెక్కి పోతాడు. అప్పుడు ఆ తరువాత సమావేశాల్లో చదివె పేపర్లు వినటానికి ఎవ్వరూ మిగలరు. వాళ్ళ నుత్సాహపరచటానికే యీ సాంస్కృతిక కార్యక్రమాలు'' అన్నాడొక సీనియర్ రిసెర్చి స్కాలర్.

''కల్చరల్ ప్రోగ్రాంలు ఏమీ లేకపోతే యీ సైంటిస్టులందరూ కల్చర్‌లెస్ ఫెలోస్ అని అనుకుంటారన్న భయం కూడా కారణం కావచ్చు'' అని మరో సీనియర్ స్కాలర్ వివరించేడు.

మొత్తానికి సమావేశాల ప్రారంభోత్సవ దినం రానే వచ్చింది. ప్రారంభమవటానికి ఒక రోజు ముందుగానే డెబ్భైశాతంమంది సైంటిస్టులు పెట్టేబేడా పిల్లాజెల్లాతో సహా యూనివర్శిటీలోని వివిధ డిపార్టుమెంట్లకు చేరుకుని వసతి సౌకర్యాలను గురించి వాకబు చేయటడం ప్రారంభించేరు. ఆ వచ్చిన సైంటిస్టులలో చాలా మంది భార్యనో, కూతురునో, కొడుకునో ఎవర్నో ఒకరిని వెంటపెట్టుకు వచ్చినవాళ్ళే. లేడీ సైంటిస్టులయితే పతిదేవుళ్ళు, పాలసీసాల పిల్లలతో సహా హాజరైనారు. ఆ వాతావరణం చూస్తుంటే సుబ్బారావుకు పెళ్లివారి విడిదిలా కనపడిందే తప్ప శాస్త్రజ్ఞుల సమావేశ స్థలంలా లేదు.

సమావేశాలకు హాజరైన జంటల్లో చాలామంది హనీమూన్ మూడ్‌లో వున్నట్టు కనపడ్డారు. వయసు మళ్లినవారైతే తమ ఎదిగిన పిల్లలకు చార్మినార్, సాలార్‌జంగ్ మ్యూజియం, గోల్కొండ మొదలైన చారిత్రాత్మక నిర్మాణాలను చవకలో చూపిద్దామన్న బడుగు బడిపంతుళ్ళ ధోరణిలో ఉన్నారు. పురుషులతో సమానం

గానో, వాళ్లకన్నా కొంచెం ఎక్కువ సంఖ్యలోనో స్త్రీలు కూడా ఉండటం వల్ల మొత్తానికి యూనివర్శిటీకి ఉన్నట్టుండి కొత్త కళ వచ్చేసింది.

కుర్ర లెక్చరర్లు, రిసెర్చిస్కాలర్లు అతిథులకు ఆహార పానీయాలందించటంలోనే పూర్తిగా మునిగిపోయారు. సీనియర్ ప్రొఫెసర్లు మాత్రం తమ తమ సబ్జక్టులకు సంబంధించిన విదేశీ శాస్త్రజ్ఞులతో కలిసి ఫైవ్‌స్టార్ హోటల్ రూములలో సమావేశం జరిపి వాళ్ళకు సకల మర్యాదలు చేస్తూ తమకు కూడా వాళ్ళ దేశాలలో జరిగే సైన్సు సమావేశాలకు ఆహ్వానాలు అందేలా ఏర్పాట్లు చేసుకోవడంలో నిమగ్నులైనారు. విదేశాలలోని యూనివర్సిటీలలో విజిటింగ్ ప్రొఫెసర్లుగాను, పోస్ట్ డాక్టరల్ రిసెర్చి చేయటానికిగాను కావలసిన అవకాశాలను కల్పించమని కోరుకుంటున్నారు.

ఆ సంవత్సరం సమావేశంలోని కీలకాంశం "పరిశోధనా రంగంలో భారత దేశం సాధించిన ప్రగతి". సమావేశాల ప్రారంభానికి ఒక సీనియర్ కేంద్ర మంత్రిని, అధ్యక్ష స్థానానికి రాష్ట్ర ముఖ్య మంత్రిని ఆహ్వానించేరు.

సాధారణంగా సైన్సు కాంగ్రెసు సమావేశాలకు ఒక కేంద్ర మంత్రిని, ఏ రాష్ట్రంలో సమావేశాలు జరిగితే ఆ రాష్ట్రంలోని సీనియర్ మంత్రినో, ముఖ్యమంత్రినో ముఖ్య అతిథులుగా ఆహ్వానించడం ఆనవాయితీ. కేంద్రంలోను, రాష్ట్రంలోను ఒకే పార్టీ ప్రభుత్వాలున్నంతకాలం ఆ ఆనవాయితీలో ఎలాటి ఇబ్బంది రాలేదు. కాని దేశంలో ఫెడరలిజం ధోరణులు పెచ్చుపెరిగిపోయి చాలా రాష్ట్రాలలో కేంద్రంలోని పార్టీ కాక మరో పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయటం మొదలైనాక కేంద్ర మంత్రిని, రాష్ట్ర మంత్రిని ఒకే వేదిక మీదకు తీసుకు రావటం తోడేలును, నక్కను ఒకే బోన్లో పెట్టినంత బుద్ధి తక్కువ అన్న కనీస రాజకీయ పరిజ్ఞానం ఆ వెర్రి శాస్త్రజ్ఞులకు లేకపోవటంతో ప్రారంభ సమావేశంలోనే చిన్న సైజు గందరగోళం చెలరేగింది.

వచ్చిన కేంద్రమంత్రి ఎనభై సంవత్సరాల వృద్ధుడు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన దగ్గరనుండి ఒకే నియోజక వర్గం నుండి వరుసగా ఎన్నికవుతూ వచ్చి, ఎన్ని మంత్రి వర్గాల మార్పులు జరిగినా తన క్యాబినెట్ మంత్రి హోదాను మాత్రం చెక్కు చెదరకుండా నిలబెట్టుకొస్తున్న ధీశాలి. ఐతే ఎంతటి రాజకీయ పాటవం ఉన్నా ప్రకృతి ధర్మాలకనుగుణంగా అతని శరీరం మాత్రం వయసుకు తగ్గట్టు పటుత్వాన్ని కోల్పోవటం వల్ల ఆయన వేదిక మీదకు ఇద్దరు గార్డుల సహాయంతో, ఒక సీనియర్ ప్రొఫెసర్ చేతి ఆసరాతో అతి కష్టం మీద చేరుకుని తన కోసం కేటాయించిన కుర్చీలో కూర్చున్నాడు.కూర్చున్న మరుక్షణం నుండి ఖంగు ఖంగుమని దగ్గటం ప్రారంభించేరు. ఆయన దగ్గినప్పుడల్లా ఉమ్మి తుప్పర్లు పక్కనే ఉన్న సైంటిస్టుల సూట్లమీద పడసాగినయ్. విదేశీ సైంటిస్టు ఆ ఉమ్మి తుప్పర్ల పరంపర ధాటికి తట్టుకో లేక బిక్కచచ్చి కుర్చీకి అతుక్కుని కూర్చున్నాడు. అతని నీలిరంగు కళ్లల్లో అణచిపెట్టుకున్న హేయభావం ఎంత వద్దన్నా తొంగి చూస్తూనే ఉంది.

స్వదేశీ సైంటిస్టుగారయితే ఆ సమావేశం కోసం



ప్రత్యేకంగా కుట్టించుకున్న ఫారిన్ క్లాత్ సూటు అడుగులోనే హంసపాదన్నట్లు సమావేశం ప్రారంభంకాకముందే కేంద్రమంత్రిగారి నోటి నుండి వస్తున్న గంగాజలంతో పావనంఅయిపోవటం చూసి నీరసపడిపోయేడు. కర్చీపుతో తుడుచుకుంటే కేంద్రమంత్రిగారి గౌరవ హోదాకు ఎక్కడ భంగం కల్గుతుందో అన్నట్లు నిటారుగా కూర్చున్నాడు ఏ మాత్రం చలించకుండా.

అన్ని కార్యక్రమాల్లాగానే శాస్త్రజ్ఞుల సమావేశం కూడా ప్రార్థనా గీతంతో ప్రారంభమయింది. మొదట 'వందేమాతరం' గీతాన్ని ముగ్గురు విద్యార్థినులు కలసి పాడేరు. వందేమాతరం పాడుతున్నంతసేపూ కేంద్ర మంత్రిగారి దగ్గు బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్కులా మధ్య మధ్య మైకులో నుండి వినిపిస్తూనే ఉంది. అది చూసి కుర్రకారు కిలకిల నవ్వుకుంటే వయసుమళ్లి యింకా వంట్లో దేశభక్తి చావని నడివయస్కులకు మాత్రం మనసు చివుక్కుమంది.

వందేమాతరం తరువాత రాష్ట్ర ముఖ్యమంత్రిగారిని సంతోష పెట్టటానికి "మా తెలుగు తల్లికీ మల్లెపూదండ" పాటకూడా పాడేరు. ఆ పాట పాడుతున్నంతసేపు ముఖ్యమంత్రిగారి ఛాతీ సైజు ఐదంగుళాల వరకు పెరిగి ఉంటుందని ఒక జియోగ్రఫీ డిపార్టుమెంటు స్కాలర్ అంచనా వేసి ఆ విషయాన్ని ఆ సమావేశం ముగిసిన తరువాత మిత్రులందరికీ చెప్పేడు. ఐతే ఆ పరిశీలనను ఆఫ్ ది స్టేజి (off the stage) ప్రకటించటం వల్ల సమావేశానంతరం జరిగిన తీర్మానాలలో ఆ అంశం చోటు చేసుకోలేక పోయింది.

మొదట కేంద్రమంత్రిగారు ప్రారంభోపన్యాసం చేసేరు. ప్రతి అరనిమిషానికీ ఒకసారి దగ్గుతూ, ప్రతి మూడు నిమిషాలకీ ఒక గుక్క మంచినీళ్లు తాగుతూ ఆయన తన ఉపన్యాసాన్ని ముప్పై నిమిషాలపాటు కొనసాగించేరు. ఆ ముప్పై నిమిషాల్లో మూడు సెకండ్లు మాత్రమే శాస్త్రజ్ఞులకు తన సందేశాన్నివ్వటానికి కేటాయించేరు. మిగిలిన ఇరవై తొమ్మిది నిమిషాల ఏభైఏడు సెకండ్లు చేసినదంతా రాజకీయ ఉపన్యాసమే!

## మినీ కవిత

వర్తమాన భర్తృహరి ఉక్తి
సుమతీ వేమన్నలు చెప్పే సూక్తి
కొండవీటి చాన్తాడు కవితలకు ముక్తి
సారమతి విదురుడు కారల్ మార్క్సు
రూపంలో
తూచి తూచి చెప్పే నీతి
కాదన్నవాడు తోకలేని ఊరకోతి!

—డాక్టర్ తంగిరాల వెంకట
సుబ్బారావు

బలమైన కేంద్ర ప్రభుత్వం దేశ సమైక్యతకు ఎంత అవసరమో ఆయన వివరించేరు. దేశంలోని విచ్ఛిన్నకర శక్తులను రూపుమాపటానికి ప్రజలంతా నడుం కట్టాలి అంటూ, బెణికిన తన నడుమును చేత్తో తడుముకున్నారు కేంద్రమంత్రిగారు.

ఆ తరువాత కొన్ని రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు కుక్కగొడుగుల్లా పుట్టుకొచ్చి దేశ సమైక్యతకు ఎలా భంగం కలిగిస్తున్నాయో చెప్తూ అసహజంగా మరో దగ్గు దగ్గేరు. కేంద్రమంత్రి ఈ విషయం చెప్తున్నప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రిగారి శరీరం కుర్చీలో యిబ్బందిగా అటూ యిటూ కదలటం స్పష్టంగా గమనించేడు సుబ్బారావు.

కేంద్రమంత్రిగారి ఉపన్యాసం పూర్తవగానే ఒక గ్లాసెడు మంచినీళ్లు తాగి రాష్ట్ర ముఖ్య మంత్రిగారు చేయబోయే అధ్యక్షోపన్యాసాన్ని వినకుండానే వేదిక దిగి వెళ్లిపోయేరు. ఢిల్లీ వెళ్లే విమానం మరో గంటలో బయల్దేరుతుందనీ కేంద్ర మంత్రిగారు ఆ నాటి క్యాబినెట్ మంత్రుల సమావేశంలో పాల్గొనవలసి ఉందనీ అందుకే వెంటనే వెళ్లిపోయేరనీ ప్రేక్షకులకు నచ్చ చెప్పేడు సమావేశ కన్వీనర్.

సెక్రటరీ రిపోర్టు వగైరా మామూలు కార్యక్రమాల తరువాత ముఖ్యమంత్రిగారు తన అధ్యక్షోపన్యాసంలో విక్రమిస్తూ బెబ్బులిలా గర్జించేరు. మేఘ గంభీర స్వరంలో తెలుగువాడి వాడిని, వేడిని కొనియాడేరు. ఆరుకోట్ల రక్త బిందువులను కూడా ధారబోస్తానని ఎలుగెత్తి చాటేరు (ఆవేశం వస్తే ఆయన అన్నంత పనీ వేదిక మీదే చేస్తాడని ఆ దగ్గర్లో కత్తులూ కటార్లు, బ్లేడ్లు వగైరా ఆయుధాలేవీ లేకుండా ముందుగానే ఇంటెలిజెన్సు అధికారులు జాగ్రత్త పడ్డారు). ఆ సమావేశానికి హాజరైన స్త్రీలవంక చూస్తూ ఆడబడుచుల అభ్యున్నతి కోసం తమ ప్రభుత్వం ఎంతగా కృషి చేస్తోందో వివరించేరు. అది వింటున్నప్పుడు స్లీవ్‌లెస్ బ్లవుజులలోను, టైటు జీన్సుల్లోను పొందికగా అమరిన ఆడవాళ్లు కాస్త గిల్టీగా ఫీలయ్యారు. తమ అభ్యున్నతికోసం ఒకరు పాటు పడవలసినంత అధమస్థితిలో ఉన్నామా అన్నట్లు లిప్స్టిక్కు పెదాలను నెర్వస్‌గా తడుపుకున్నారు.


ఆఖరున ముఖ్యమంత్రిగారు చేతులు జోడించి సభకు నమస్కరిస్తూ "మీరంతా సైంటిస్టులు. విజ్ఞాన ఖనులు. నేనా పట్టి సన్యాసిని. బూడిద తప్ప నేను మీకేమివ్వగలను? ఆ భగవంతుడి ఆశీస్సులు మీకెల్లప్పుడూ ఉంటాయి" అంటూ ఉపన్యాసాన్ని ముగించారు.

ముఖ్యమంత్రిగారి ఉపన్యాసం ముగియగానే అప్పుడే వడగళ్లవాన కురిసి ఒక్కసారిగా ఆగిపోయినంత ప్రశాంతత ఆవరించుకుంది ఆ వాతావరణంలో. సాయంత్రం పూట వర్షం వెలిసిన తరువాత తూర్పున ఉదయించే ఏడురంగుల ఇంద్రధనుస్సులా సాయంత్రం ఆరుగంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమైనాయి. మొదటిరోజు జరిగిన బుర్రకథను కూచిపూడి నృత్యాన్ని మంత్రుల ఉపన్యాసాలతో విసిగి వేసారిన సైంటిస్టులు, వారి కుటుంబాల వారు ఎంతో ఆసక్తిగా పరిశీలించేరు. కొంతసేపు. కాని భాష అర్థం కాకపోవటం వల్ల ఒక గంటగడవగానే వాళ్లకి ఆ కార్యక్రమాల మీదకూడా విసుగు పుట్టింది. సభ్యత కోసం కొందరు కుర్చీల్లోనే కునికిపాట్లు పడుతుంటే మొహమాటాలు లేని వాళ్లు మాత్రం తమ వసతి గృహాలకి పోయి హాయిగా పడుకున్నారు.

ఆ సమయంలో సుబ్బారావు ఏర్పాటు చేసిన బుర్రకథ టీము నాసిరకంగా ఉందని ఒక రిసెర్చిస్కాలర్ కామెంట్ చేసేడు.

"రిసెర్చిలో చేరి రెండేళ్లయినా ఇంతవరకూ ఒక్క పేపరు కూడా ప్రొడ్యూస్ చేయలేదు వాడు. ఒక్క సంవత్సరంలోనే నేనొక పేపరు వ్రాసి సైన్సు కాంగ్రెసులో చదువబోతున్నానని వాడికి నా మీద జెలసీ. వాడి మాటలు నమ్మకండి. ఆంధ్రదేశంలో ఉన్న బుర్రకథల గ్రూపులన్నిట్లోకి బెస్ట్ గ్రూపును తీసుకు వచ్చేను నేను" అంటూ అడిగినవాళ్లకూ అడగనివాళ్లకూ అందరికీ నచ్చచెప్పేడు సుబ్బారావు.

రెండవరోజు అసలు సమావేశాలు ప్రారంభమై



వాయి. బోటనీ, జువాలజీ, ఫిజిక్సు, కెమిస్ట్రీ, మాథ మెటిక్స్ మొదలైన సైన్సు డిపార్టుమెంటులలో వేర్వేరుగా ఆయా సబ్జక్టుల మీద సెమినార్లు, సింపోజియంలు జరిగినాయి. ఆ సబ్జక్టులలో కూడ ప్రత్యేక విభాగాలకు సంబంధించిన అంశాలపై అనుభవజ్ఞులైన శాస్త్రజ్ఞులు ప్రసంగించేరు. ఆయా రంగాలలో తాము జరుపుతున్న పరిశోధనల ఫలితాలను వివరించేరు.

సుబ్బారావుకు అంతకు ముందు వరకు సైంటిస్టు లన్నా, ప్రొఫెసర్లన్నా ఎంతో భయభక్తులుండేవి. ఆ సమావేశాల తీరు తెన్నులను పరిశీలించిన తరువాత వాళ్ల యెడల ఉన్న గౌరవభావం పూర్తిగా తుడుచుకు పోయింది. తమ యింట్లో మూడు దశాబ్దాల క్రితం చనిపోయిన తాతగారికి పెట్టే తద్దినం ఇంతకన్నా భక్తి శ్రద్ధలతో తమ యింట్లోని వాళ్లంతా జరుపుకుంటారని పించింది.

పరిశోధనా రంగంలో కాకలు తీరిన సైంటిస్టులుగా పేరు పొందిన వాళ్లలో చాలామంది తమ విదేశయాత్ర లకు, ఎగ్జామినర్ షిప్పులకు అయ్యే దారి భత్యాల యెడల చూపే శ్రద్ధలో పదోవంతుకూడా తమ పరిశోధనలో చూపటం లేదని తేటతెల్లమవుతుంది.

ఆ సమావేశాల్లో చదివిన పరిశోధనా పత్రాలలో నూటికి తొంభై ఏడు వరకు ఏ ప్రత్యేకతాలేని రొటీన్ వ్యాసాలే!

ఉదాహరణకు కెమిస్ట్రీలో జరిపే పరిశోధనలో కొన్ని ప్రమాణ సమ్మేళనాలను తీసుకుని వాటిలోని ప్రతిక్షేప కాల (Substitueuts) స్థానాన్ని మార్చటం, లేదా ఒక ప్రతి క్షేపం బదులు మరొక ప్రతిక్షేపకాన్ని నిక్షిప్తంచేసి దానినే సరికొత్త సమ్మేళనంగా చెలామణీ చేయటం జరుగుతుంది. ఒక యూనివర్సిటీలో ఒక డిపార్టుమెంటులో ఒక గైడు ఆధ్వర్యంలో జరిగే పరి శోధనా పత్రాలన్నీ కొంచెంతేడాతో ఒకే రకంగా ఉంటాయి. రిసెర్చి స్కాలర్ల పేర్లు మాత్రం తేడా ఉంటాయి తప్ప పరిశోధనా ఫలితాల సారాంశం మాత్రం అదే!

వైవిధ్యం లేకపోవటమేకాక, విజ్ఞాన శాస్త్ర రంగంలో మౌలికమైన మార్పులను తీసుకురాగల పరిశోధనా వ్యాసాల సంఖ్య కూడా చాలా తక్కువ.

రిసెర్చిస్కాలర్లకు డిగ్రీలు కావాలి.

లెక్చరర్లకు, రీడర్లకు ప్రమోషన్లు కావాలి.

ప్రొఫెసర్లకు విదేశ యాత్రలు, జాతీయ, అంతర్జా తీయ సంస్థలలో హోదా గల పదవులు కావాలి.

అందుకోసమే నడుస్తున్నది యూనివర్సిటీలో పరి శోధన. ఈ పరిశోధన కొద్ది శాతం మేధావుల అభ్యున్నతికోసం ఉపయోగ పడుతోందే తప్ప అధిక సంఖ్యాకులైన సాధారణ మానవుల శ్రేయస్సుకోసం ఏమాత్రం ఉపయోగపడటం లేదు.

అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన ఒక బోటానిస్టు తాడి చెట్టును ఒక అంగుళం సైజులో మట్టిపాత్రలో ఎలా పెంచవచ్చో పరిశోధన చేస్తాడు.

ఫిజిక్సు ప్రొఫెసర్ ఒక సమ్మేళనం స్ఫటికాన్ని ఎక్స్ రేల వికిరణసాయంతో అధ్యయనం చేస్తాడు. రసాయన శాస్త్రజ్ఞుడు అంతకు ముందే తెలిసిన కొన్ని సమ్మేళనాల నిర్మాణాల ఆధారంగా మరో సమ్మేళనాన్ని కొద్ది పాటి మార్పులతో సృష్టిస్తాడు.




కాని వీటివల్ల సామాన్య మానవుడికి జరిగే ప్రయో జనం శూన్యం. ఇతరదేశాల్లోని పరిస్థితి కూడా చాలా వరకు అంతే అయినా, కనీసం పది శాతం రిసెర్చి అయినా మానవ శ్రేయస్సుకోసం వినియోగపడుతోంది. మన దేశంలో అది చాలా అరుదైన విషయం.

అందుకే మనదేశంలో సైంటిస్టుకీ సామాన్య మాన వుడికీ మధ్య పెద్ద అగాధం ఏర్పడిపోయింది.

## చిల్లర కోరిక

చుక్కలంటే ధరల్ని
చూరుకిందకి దించొద్దులే
డొక్కలెండిన బక్కవాడికి
గుప్పెడన్నం పెట్టొద్దులే

అందలాల్లో
చందమామని కోరను
అందరికీ
బతుకుతెరువులడగను
వొక కొత్తరూపాయి కాయితం చూపించు
చాలు!
వొక రూపాయి చిల్లరిప్పిస్తే అదే
పదివేలు!

—షమా

సైంటిస్టూ, సామాన్యుడూ ఒకరికొకరు ఎంతో అపరిచితులు యీ దేశంలో.

విదేశాలలోకన్నా మన దేశంలోని మరో ప్రత్యేకత ఏమంటే అన్ని రంగాలలో వలెనే సైన్సు రంగంలో కూడా "గత కాలము మేలు వచ్చేదు కాలముకంటెన్" అనే కరడుగట్టిన సనాతన భావాలు గల ఛాందసుల సంఖ్య చాలా ఎక్కువ.

అందుకే సభలో ఆఖరి రోజున జరిగిన ముగింపు సమావేశంలో ఆయా సమావేశాల కార్యక్రమాలను సమీక్షిస్తూ జరిపిన తీర్మానాలు చాలా ఆసక్తికరంగా కనిపించినయ్ సుబ్బారావుకు.

కొన్ని లక్షల వ్యయం చేసి ఏర్పాటు చేసిన సమా వేశాల్లో నిగ్గు తేల్చిన అంశాలివి.

1] బిడ్డలకు డబ్బా పాలకంటే తల్లిపాలే శ్రేష్టం.

2] తాటి చెట్లను అరంగుళం సైజులో కూడా పెంచ వచ్చును.

3] చేపలలో మానవులలోకన్నా మమతానురాగాలు ఎక్కువ.

4] రసాయన సమ్మేళనాలను గుర్తించటంలో మాస్ స్పెక్ట్రా (Mass Spectra) వంటి అని శ్చిత మార్గాలకన్నా వేరుగా రసాయన చర్యలనే ఉపయోగించటం శ్రేయస్కరం.

5] మానవుడి ఆరోగ్యానికి నేడు వాడుకలో ఉన్న ఎల్లోపతీ, హోమియోపతి వంటి పద్ధతులకన్నా ఆక్యుపంక్చర్ వంటి ప్రాచీన వైద్య విధానాలు, నల్లమలై అడవులలోను, హిమవన్నగాల ప్రాంతం లోను లభించే మూలికల కషాయాలను వాడటం శ్రేష్టం. కనుక ఎం.బి.బి.ఎస్. పట్టా పుచ్చుకున్న

యువతీ యువకులందరూ నిర్బంధంగా మూడు సంవత్సరాల పాటు అడవులలో మూలికలనన్వేషించి తీసుకు రావాలి. ఈ విషయంపై తగు చర్యలు తీసుకోవలిసిందిగా ప్రభుత్వాన్ని ప్రార్థించటం జరిగింది.

(నిత్య నూతన యవ్వనానికి, దీర్ఘాయుష్షుకు యూరినో థిరపీ (ఎవరి మూత్రాన్ని వారే త్రాగటం) మంచిదని ఒక వృద్ధ శాస్త్రజ్ఞుడు ఒక సెమినార్‌లో సూచించినప్పుడు ఆయనమీద గౌరవంకొద్దీ ఎవ్వరూ ఆయన ఎదుటగా కాదనలేదుగాని ఆ తరువాత యువ సైంటిష్టులు, ముఖ్యంగా స్త్రీ సైంటిష్టులు ఆ సూచనకు తీవ్ర అభ్యంతరం తెలపటం వల్ల దానిని తీర్మానాలలో చేర్చ లేదు). ఇలాటివే కొన్ని తీర్మానాలను ప్రతిపాదించి చివరకు భారత దేశంలో విజ్ఞానరంగంలో పరిశోధన సంతృప్తికరంగా జరుగుతోందన్న ఆనందాన్ని వెల్లడి చేసేరు సైంటిష్టులు.

ఆ తరువాత టియే, డియే లెక్కలు ఖచ్చితంగా సరిచూసుకుని తీసుకుని కుటుంబసమేతంగా భాగ్యనగర సందర్శనం చేసుకుని తమ తమ రాష్ట్రాలకు, దేశాలకు తిరిగి వెళ్లిపోయేరు. తిరిగి వెళ్ళే సమయంలో పరిశోధనా రంగంలో మరో మైలురాయిని సృష్టించామన్న ఆలోచన కన్నా రొటీన్ లైఫ్ నుండి కొంత మార్పు లభించిందన్న ఆనందమే వారికి మిగిలింది.

అయితే ఇంచుమించు పైన చెప్పిన తీర్మానాలే గత




రెండు శతాబ్దాలుగా ఏటేటా జరిగే సైన్సు కాంగ్రెసు సమావేశాలలో కాస్త తేడాతో జరిగినాయనీ, మరో రెండు దశాబ్దాల వరకు జరగబోయే సమావేశాలలోని తీర్మానాలు కూడా యించుమించు అలాగే ఉండబోతాయని సుబ్బారావు వంటి కుర్రసైంటిష్టులకు మాత్రం తెలియని సత్యాలు.

కాని ఇవన్నీ ఒక ఎత్తు సుబ్బారావుకు కలిగిన మనః క్లేశం మరొక ఎత్తు. ప్రొఫెసర్ పరబ్రహ్మంచేత నానా నరకయాతనలు అనుభవించి పైకి వంకర నమస్కారాలు చేస్తూ,ఇచ్చకాల నవ్వులు నవ్వుతూనే లోలోపల ఆయన్ను అచ్చ తెలుగు తిట్లు తిట్టుకుంటూ పూర్తిచేసిన ప్రథమ పరిశోధనా పత్రాన్ని శాస్త్రజ్ఞుల సమావేశంలో చదవగల అవకాశమే లభించలేదు సుబ్బారావుకు.

హేమాహేమీలైన జాతీయ అంతర్జాతీయ ప్రొఫెసర్లు పాల్గొన్న ఆ సమావేశంలో సీనియర్లందరూ తమ తమ బలాబలాలను (పదవుల దృష్ట్యా-పరిశోధనా నైపుణ్యం దృష్ట్యా కాదు) ప్రదర్శించుకునేందుకు తంటాలు పడ్డారే తప్ప సుబ్బారావు వంటి ఔత్సాహికులైన అర్భక సైంటిష్టులను కేర్ చేసిన పాపాన పోలేదు. అతని పరిశోధనా వ్యాస ఫలితాల సారాంశాన్ని(abstract) టైపు చేయించి బోర్డుమీద అతికించేరు. అలా పదిలైన్లలో బోర్డుమీద తన పేరు చూసుకుని "ఈ యేటికి యిది చాలు" అని సంతృప్తిపడ్డాడు సుబ్బారావు.

(నోట్: సెటైర్ కోసం వాడిన అతిశయోక్తులను ఇగ్నోర్ చేసి కథలోని స్పిరిట్‌ని అర్థంచేసుకోవటానికి ప్రయత్నించమని విజ్ఞులైన శాస్త్రజ్ఞులకు విన్నపం-రచయిత్రి)


దీపావళి శుభాకాంక్షలతో

స్థాపితం: 1939 గ్రామ్స్: VISHNUCO ఫోన్: 73560

# శ్రీ విష్ణు అండ్ కంపెనీ

కృష్ణనివాస్, బీసెంట్ రోడ్, విజయవాడ - 520 002

అన్నిరకముల ఆఫీసు స్టేషనరీ, డ్రాయింగు, ఆర్టిస్టు పరికరములకు, సర్వే మరియు ఇంజనీరింగు అయిటమ్సుకు మా ప్రత్యేకత

మా శ్రీ విష్ణు అండ్ కంపెనీ ప్రెస్‌లో

అన్నిరకముల అచ్చు పనులు సకాలములో అందముగా తయారు చేయబడును